# పొడవని పొద్దు

మునిమాపువేళ ఆ చింతలతోపు వెనక పొగ లేచి మబ్బుల్లో కలిసిపోతోందే—అదేవూరు. ఆ వూళ్ళో పదేళ్ళ వెనక తాగుబోతు ఉండేవాడు. అతడి అసలు పేరు నారాయణ కాని తిట్టుపేరే సార్థకమైపోయింది. తాగుబోతు ఎక్కణ్నించి వచ్చాడో ఎవరికీ తెలియదు. అతడు చేసిన దురాగతాలకు లెక్కలేదు. ఆ కథ ఇప్పటికీ చెప్పుకుంటారు. ఆ కథ వింటుంటే చిన్నపిల్లలు బ్రహ్మరాక్షసికథ వింటున్నట్లు భయపడిపోతారు. అసలు కథ యేనాది సింగికి ఒక్కతెకే తెలుసు. సింగి ఇప్పటికీ అంటుంది. 'అంత మంచోడు లేడు. ఈ వూరోళ్ళు, ఆణ్ని పొట్టనెట్టుకున్నా'రని.

సింగి ఊరికి దూరాన అంకమ్మ గుడిదగ్గర గరపచేలో కూలికిపోయి తిరిగొస్తుంటే మసకచీకటి పడుతోంది. తనతోటి కూలీలంతా ముందు సాగిపోతే తనే వెనకచిక్కింది. పిట్టలన్నీ ఏటిమీదిగా గూళ్ళకు పోతున్నాయి. కాలిబాట మసగ వెల్తుర్లో నదరుగా కన్పించటంలా. ముందుపోతున్న కూలీలు కూడా కనుమరుగౌతున్నారు. తనూ గబగబా అడుగులు వెయ్యటం మొదలెట్టింది.

అంతలో పక్క చేలోంచి ఎవరో ఒక్క ఉదుటున డొంకలోకి దూకి సింగిని పట్టుకున్నాడు. సింగి కెవ్వున అరవబోతే నోరు నొక్కి బలంగా దగ్గరికి లాక్కున్నాడు. సింగి పట్టు విడిపించుకోటానికి గిలగిల కొట్టుకోవటంలో, అతడు తన

ఇనప కమ్మల్లాంటి చేతుల్తో మరీ గాఢంగా హత్తుకోవటంలో, అసలే చివికిన సింగి రవిక పిగిలి పోయింది. స్పర్శ తగలగానే నెత్తురు జివ్వు మని ఉరకలు పెట్టింది. సింగి బలవంతంగా పట్టునుంచి చెయ్యి లాక్కుని, అతడి మొహంమీద ఒక్క గుద్దు గుద్ది నేలకు తోసేసింది.

'ఛీ! సచ్చినోడా!' ఎవఁడ్రా నువ్వు? గొంతు జీర పోయేట్టు అరిచింది, పవిట సరిచేసుకుంటూ.

చింత చెట్టు గూట్లో పాలపిట్ట ఆడపిట్ట రాకపోవటం చూసి 'ఖఁయ్' మని కూసింది.

సమాధానంగా సారా వాసన గప్పు మని కొట్టింది.

'తాగుబోతు నాయాల' అని సింగి చీర విదిలించు కుంటూ ఊరివైపు పరిగెత్తింది.

సింగి కొట్టిన దెబ్బకి తాగుబోతు ప్రాణం దిమ్మర పోయింది. ఆ తాపుకి తూలి పొలిమేర బండమీద పడటంలో పన్ను గుచ్చుకుని పెదిమనుంచి రక్తం కారుతోంది. సింగి ఊరివైపు పరుగెత్తుతోందే కాని, అతడు రాయిమీద పడ్డ ప్పుడు మూల్గటం, నోటి పక్కగా నెత్తురురావటం చూడక పోలేదు. సింగి వాటిని తలుచుకుని భయపడిపోయి మరీ తొంద రగా గుడిసెవైపు ఉరుకులు పెట్టింది.

జొన్నన్నంకుండ పొయ్యిమీద కెక్కించి, నీళ్ళు పోసు కుంటూ అదే ఆలోచిస్తోంది. 'వాడికి దెబ్బగాని తగ్గలేదు గదా! మొహం చూస్తే ఎంత భయమేసింది – అయినా కళ్ళెందుకో అట్టాలేవు. ఏ వూరోడో ఏమో' ఒంటికి ఒళ్ళు తగల డం తను చలించిపోవడం తలుచుకుని, సిగ్గుపడిపోయి, స్నానం సాంతం కాకుండానే చీరచుట్టుకు వచ్చేసింది. కుండ పొయ్యి

మీంచి దింపి, అన్నం కంచంలో పెట్టుకోబోయింది. ఎందుకో తినబుద్ధి కాలేదు. కుండమీద మూతపెట్టి, తడిక దగ్గిరికిలాగి గుడిసెబయటికి వచ్చేసింది.

తాగుబోతు చేను దాటివచ్చి పక్కనే పారుతున్న యేట్లో కారుతున్న నెత్తురు కడుక్కున్నాడు. చంద్రుడు మెల్లిగా ఆకాశం మెట్లు ఎక్కుతున్నాడు. బండరాయి తలాపిగా చేసికొని ఇంకోరాయి కాళ్ళకింద ఆనుడు పెట్టుకుని, ఆకాశంవంక చూస్తూ, నవ్వుకుంటూ వెల్లకిలా పడుకున్నాడు. సింగి ఒడ్డు మీంచి ఆ మనిషిని ఆ వాటంలో చూసి 'ఎట్టా పిలవటం?' అనుకుంది. పిలవకుండా ఒడ్డు దిగివచ్చి తల దగ్గిరగా నుంచుంది. తాగుబోతుకి సింగి రావటం తెలీదు. చంద్రుడి చుట్టూ ఉన్న చుక్కల్ని లెక్క పెడుతున్నాడు.

'కూడూ నీళ్లూ ఏవీః అక్కర్లా? ఎవర్నో కావలసిన వాణ్ని అడిగినట్లు అడిగింది.

ఆకాశంలో చుక్క తళుక్కున మెరిసి సిగ్గు పడింది.

తాగుబోతు బద్ధకంగా పక్కకి ఒరిగి తలతిప్పి సింగిని కిందికీ పైకీ చూశాడు. సింగి పెదిమలు బిగించి అతనిలోకి చూస్తూ నవ్వింది. ఆ రెండు క్షణాల కాలంలో ఇద్దరూ ఒకళ్లకొకళ్ళు చాలా కాలంనుంచీ తెలిసున్న మనుషుల్లా, కొత్తేమీ లేకుండా, మామూలుగా మాట్లాడుకునే మనసు కలిసిన వాళ్ళలా అనుకున్నారు.

'నా కక్కర్లేదు' అన్నాడు తాగుబోతు తల తిప్పేసుకుని.

'కూడు తినకపోతే సస్తావ్.' గబుక్కున తల దగ్గిర కూర్చుని జుట్టు పట్టుకు ఊపుతూ, మొహంలో మొహం పెట్టినవ్వి అంది 'లే'.

అంతే. లేచి సింగి వెంట వెళ్ళిపోయాడు తాగుబోతు. ఆరోజు రాత్రి సింగి అతన్ని పిలుచుకురాకపోతే, తాగుబోతు ఆ వూరికి వచ్చేవాడే కాదు. ఈ కథే లేదు.

*　　　　*　　　　*

'పారిపోయిన సింగి మొగుడు తిరిగొచ్చాట్ట.'

'అబ్బే' వాడు సింగి మొగు డెందుకయింది – ఎవడో సైన్యం నుంచి పారిపోయొచ్చాట్ట!'

'దూరపు చుట్టంట. అయినాదానికి బావ వరసేనంటలే!

ఇలా వేర్వేరుగా అనుకున్నారు జనం. అతడు వూళ్ళో అడుగుపెట్టిన మూడోనాడే తెలిసింది. 'వాడు తాగుతాట్ట!' అని. తాగుబోతు బజార్లోవస్తొంటే ఆడవాళ్ళుతప్పుకుపోయేవారు. వాళ్ళలా తప్పుకు పోతుంటే వీధిలో ఆడుకునే పిల్లలు, ఆశ్చర్యంగా తాగుబోతువంక, ఆడవాళ్ళవంక ఆటమాని చూసేవాళ్ళు. తాగుబోతుకి వీళ్ళధ్యాసే లేదు. అతడెప్పుడూ మైకంలోనే ఉండేవాడు. ఉంటే సారామైకం, లేకపోతే సింగి.

ఊళ్ళో కార్పణ్యం, ఆవేశం, పగ, ప్రతీకారం మొదలైనవన్నీ రెండు సమభాగాలుగా వేరుచేయబడ్డాయి. ఒకదానిపేరు వీరాస్వామి. రెండో దానిపేరు రామినాయుడు. వీరాస్వామి, రామినాయుడు లేకపోతే పై చెప్పబడిన వాటికి మంచినీళ్ళు కూడా పుట్టవు. రామినాయుడికి వీరాస్వామికి పడని కారణం మరేమీ లేదు. రామినాయుడు అతగాడి తండ్రి కొడుకవటం, వీరాస్వామి వాళ్ళ తాత మనవడుగా పుట్టటం.

మనిషికి ఎవరన్నావచ్చి 'నువ్వంటే వాడికో(కోపం' అన్నప్పుడు మొట్టమొదటగా వచ్చేది కోపం. వాడికి తనమీద ఎందుకు కోపమో, వాడికో(కోపం వస్తే తన కెందుకు రావాలో

ఆలోచించడు. అట్లాగే జరిగింది వీరాస్వామి విషయంలో. ఒకరోజు పొద్దున్నే పచ్చదనం చూసి నొచ్చుకునే ఓ పెద్ద మనిషి సరాసరి వీరాస్వామి దగ్గరికొచ్చి 'రామినాయుడికి నీ మీద విరోధమట!' అన్నాడు.

'హాఁయ్! అయితే వాడంటే నాకూ విరోధమే' అన్నాడు వీరాస్వామి ఆవేశంగా.

'ఎందుకు విరోధం?' అని అడుగుతాడేమోనని సమాధానం తయారుగా పెట్టుకున్న పెద్ద మనిషికి దాని అవసరమే లేకపోయింది. ఎందుకయినా మంచిది, మరోకట్టె తగిలిస్తే మరీ బాగా రాజుకుంటుందని కారణంకూడా చెప్పేశాడు.

'నీ మీద కాదుట కోపం. నీ ముత్తాతమీద అతనికి చిన్నపట్నించీ పగ ఉందిట' —

'నా ముత్తాత మీద పగయితే, వాడి మీద నాకు మరీ పగ' అన్నాడు వీరాస్వామి మీసం బిఱ్ఱుగా మెలేస్తూ.

'సరికి సరి — అట్లా ఉండాల' అనుకుని పెద్ద మనిషి పైపంచె దులుపుకుంటూ లేచిపోయి, రామినాయుడిదగ్గరఆపాటే పాడేశాడు. ఆ నాటి నుంచీ ఊళ్లో మొగవాళ్లూ, ఆడవాళ్లూ, ఇళ్లూ ఆస్థులూ, పండగలూ జాతర్లూ, పశువులూ, రచ్చబండ, దేవాలయం, మంచీ, చెడూ వీరాస్వామి రామినాయుళ్ళ పేరిట విభాగాలు పడ్డాయి. ఇంతటి విభాగంలోనూ, ఒకళ్ళపై ఇంకొకళ్ళు ఇంత కత్తులు నూరటంలోనూ, ఇంత బరిసెలు దిగేసుకోవటంలోనూ ఒక చెయ్యీ చెయ్యీ కలుపుకోవటం, ఒక శృంగార హేల ఉంది. అదే రామినాయుడికీ, వీరాస్వామి విధవ చెల్లెలికీ ఉన్న సంబంధం.

ఊరంతా వెన్నెల వరదలో మునిగి ఉంది. అప్పటి దాకా ఆ ఊసూ ఈ ఊసూ చెప్పుకున్న జనం ఆవులిస్తూ ఇళ్ళ దారి పట్టారు. నిశ్శబ్దం పక్క పరుచుకుని మత్తుగా జోగుతోంది. గాలికి ఎక్కడో ఎండు తాటాకు 'పెటపెట' లాడటం తప్ప మరే చలనమూ లేదు.

వరిగడ్డి వామి చాటున సరస్వతమ్మ రామినాయుడి మీద కొరిగి రహస్యంగా చెవిలో ఏదో చెప్పింది. కండలు తిరిగిన రామినాయుడి చేతులు, సరస్వతమ్మ వీపుని చుట్టి నొక్కి పట్టినై. ఇద్దరు మనుషుల మోపుకి వామి తట్టుకోలేక దక్షిణం పక్కగా ఒరిగింది. రామినాయుడి నూగు మీసం వెన్నెట్లో తళతళ మెరుస్తోంది. మగ్గిన వరిగడ్డివాసన తియ్యగా గాలినంతా కప్పింది. అచ్చటి ఎండు గడ్డి వామిలో ఒక్క మనిషే ఉన్నాడనిపించే రామినాయుడు సరస్వతమ్మల ఆకారాన్ని కప్పిపుచ్చటానికి దానిమ్మ చెట్టు నీడ చాలటం లేదు.

'మా అన్నమీద పార్టీలో నువ్వే గెలుస్తావా? సరస్వతమ్మ రామినాయుడి మీసాన్ని కిందికి తిప్పుతూ అడిగింది. 'ఛీ' అని రామినాయుడు కోపంగా సరస్వతమ్మ చెయ్యిమీద ఒక్కటంటించి, మీసాన్ని తిరిగి సరిగ్గా మెలేసుకున్నాడు.

'అబ్బో! నా నాయుడికెంత రోసం!' అని వెన్నెట్లో పళ్ళు మెరిసేటట్లు నవ్వి, రామినాయుడి తలని రొమ్ముకి హత్తుకొని గిరజాలజుట్టు ముద్దుపెట్టుకుంది.

దూరంగా గాలి ఈలపాడింది.

ఒక్కక్షణం ఆగి గాలి 'లాలలా...ఓ...లో ఓ...' అని మొగగొంతులో వరస అందుకుంది.

'అబ్బే! అది గాలి కాదు. ఎవరో మనిషి వస్తున్నాడు' అనుకున్నా రిద్దరూ.

దూరంగా తాగుబోతు తాటిచెట్ల మధ్యనుంచీ, తూలుతూ తప్పటడుగులు వేస్తూ, సన్నగా పాడుకుంటూ వస్తున్నాడు. తాగుబోతు లిల్లాయిపదం పాడుతూ మర్రిచెట్టు దాటి దగ్గరికి వచ్చేస్తున్నాడు. రామినాయుడు, సరస్వతమ్మ వామిలోకి మరీ ఒత్తుకున్నారు. తాగుబోతుకి వామిలో అలికిడి తెలిసింది. ఎవరో దొంగతనంగా దాక్కున్నట్లు కన్పించింది. వూళ్ళో వేటలు, కోళ్ళు గల్లంతవుతున్నాయని జనం అనుకోవటం విన్నాడు. 'నాయాలు దొంగతనానికొచ్చి నన్ను సూసి దాక్కున్నాడు. ఈయేళ ఈణ్ణెట్టాగయినా పట్టేయాల' అనుకున్నాడు. తను పదం ఆపేసి నుంచొని వామివైపే చూచాడు. వామిలో ఆకారం కదలటంలేదు. ఆకారం ఎటు కదుల్తుందో చూసి ఒడుపుగా మీదపడదా మనుకున్నాడు తాగుబోతు. కాని వామి కదల్లేదు. తనే ఊతంగా వామివైపు అడుగు వేశాడు. రామినాయుడు, సరస్వతమ్మ బెదుకుతిన్నారు. తాగుబోతు పదడుగుల దూరానికి రావటం చూసి రామినాయుడు చల్లగా ఇవతలకి వచ్చి చెంగున వామి అవతలకి దూకేశాడు. సరస్వతమ్మ వామి నంటిపెట్టుకుంది.

తాగుబోతు 'తప్పు, సేసేన్రా – జంట అని తెలియక పాయెనే'అని చప్పున నాలిక కొరుక్కున్నాడు. దూకి వెళ్ళింది రామినాయుడని గుర్తుపట్టిన తాగుబోతు సరస తమ్మ ముందుకు వచ్చేశాడు.

'నీకు సిగ్గు లేదంటమ్మ సరస్వతమ్మ గోరూ—పొద్దున లేస్తే మీరు అళ్ళూ ఒక్క రేవులో నీళ్ళు తాగరు గందా!

ఇప్పుడీ వరసా — థూ!' అని ఉమ్మేసి తిరిగి చూడకుండా పెద్దపెద్ద అంగలేసుకుంటూ వెళ్ళిపోయాడు తాగుబోతు.

*　　*　　*

ఊళ్ళో ఎలక్షన్లు దగ్గిర పడుతున్నాయి. రామినాయుడు వీరాస్వామి ఎవరికి వారు ఈ దెబ్బతో బలాబలాలు తేల్చు కోవాలనుకున్నారు. వీరాస్వామి తనని గెలిపిస్తే రాములవారి గుడికి మండపం కట్టించి, మూడెకరాలు దేవుడికి రాస్తా నన్నాడు. రామినాయుడు గుళ్లో ధ్వజస్తంభం ఎత్తించి ఐదెక రాలు అమ్మవారిపేర పెడతానన్నాడు. ఊళ్ళో రెండు రచ్చ బండలు వెలిసాయి. వీరాస్వామి రచ్చబండ దగ్గర హరికథ చెప్పిస్తే—రామినాయుడి రచ్చబండమీద బుర్రకథ మోగింది. వీరాస్వామి రచ్చబండమీద వెలగపూడి భాగోతులతోలు బొమ్మలాడితే, రామినాయుడు రచ్చబండ మీద నగరి మేళం వాళ్ళ నాట్యం చేశారు. ఊరు ఊరంతా సందడిగా మా లక్షమ్మవారి జాతర్లా తొక్కిడిగా ఉంది. గూడెం మాలలు వీరాస్వామి పక్కో, రామినాయుడి పక్కో తేల్చుకోలేక తికమక పడ్తున్నారు.

'గూడెం వోట్లన్నీ ఒక్క ఝారున ఏసేస్తాం. ఐదొందలు పారెయ్యండి' అన్నాడు గూడెం పెద్ద.

'సరే! ఖాయం. మాటమీద నిలవాల' అన్నాడు రామినాయుడు.

డబ్బులో సగం వారంరోజుల్లో ఇచ్చేటట్లు, మిగతా సగం ఎలక్షను రోజు పొద్దున్నే ముట్టచెప్పేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. సరిగ్గా అదే సమయానికి రామినాయుడి చేతిలో డబ్బుఖురకాటంగా ఉంది. పట్నం పోయిన మనుషులు

ఇంకా తిరిగి రాలేదు. వారం రోజుల గడువు రేపటితో చెల్లు తోంది. ఏ ఉపాయం తోచలేదు రామినాయుడికి. అర్ధరాత్రి ఉన్నట్టుండి పక్క మీంచి లేచిపోయాడు.

వీరాస్వామి మండువాలో చీకటి చిక్కగా కమ్ము కుంది. రామినాయుడు కిటికీ పక్కగా నుంచుని లోపలికి తొంగిచూశాడు. మినుకు మినుకు మనే చిమ్నీ వెలుగులో నిద్రపోతున్న సరస్వతమ్మ, వీరాస్వామి భార్య, పిల్లలు కన్పిం చారు. రామినాయుడు మట్టి బెడ్డ సూటిగా సరస్వతమ్మ కొప్పులోకి విసిరాడు. సరస్వతమ్మ ఉలిక్కిపడి లేచింది. పక్కమీద మట్టిబెడ్డ పట్టుకు చూసింది. చప్పుడు గాకుండా లేచివెళ్ళి దొడ్డి తలుపు తీసి, వామిచాటు కొచ్చేసింది.

'ఇంత రాత్రేలొచ్చావేం?' నిద్రకళ్ళతో మత్తుగా రామినాయుడి విశాలమైన ఛాతీమీద గొణిగింది.

'అవసరంగా పనొచ్చింది' అన్నాడు రామినాయుడు సరస్వతమ్మను పొదివి పట్టుకొని.

'ఏందో...అంత పని?'

'...డబ్బు కావాల' మెల్లిగా అన్నాడు.

రామినాయుడి గుండెమీంచి తల తీసుకొని 'మా అన్న మీద పార్టీ కేగా?' సూటిగా అడిగింది సరస్వతమ్మ.

రామినాయుడు మాట్టాళ్ళేదు.

'ముచ్చల్లే మాటాడ్డు సూడు' అని రామినాయుడి గడ్డం పట్టుకు ఊపి, మెత్తగా శబ్దం లేకుండానవ్వి 'ఇక్కడే ఉండు... వస్తా!' అని లోపలికెళ్ళింది.

రామినాయుడి గుండె మీది కండరాలు ఆనందంగా పొంగినై.

నోట్లతో తిరిగివస్తున్న సరస్వతమ్మని సంతోషంలో ఒక్క ఊపున మీదికి లాక్కుని ఒంట్లో చిక్కించుకున్నాడు. వందరూపాయల నోట్లు 'ఫెళ ఫెళ' ఒత్తుకున్నై.

రామినాయుడు నలిగిన వందరూపాయనోట్లు ఐదు లెక్క పెడుతూ, చీకట్లో సరస్వతమ్మని చూశాడు. అంతలో పక్కనే అలికిడైంది. రామినాయుడు సరస్వతమ్మ భయంతో స్తంభించి పోయారు. ఎదురుగుండా మనుష్యాకారం అటూ ఇటూ కదలకుండానిల్చొని ఉంది.

రామినాయుడికీ, సరస్వతమ్మకి నోటమాట పెగల్లేదు.

అంతలో ఎదురుగాఉన్న మానుషాకారం మాట్లాడింది.

'ఏంది దొరా ఆ పని?' సారా కంపు గప్పుమంది.

ఇద్దరూ మనిషిని గుర్తుపట్టారు. రామినాయుడు ముందుకు దూకబోయాడు. సరస్వతమ్మ రామినాయుడి చెయ్యి నొక్కిపట్టి ఒక్క సెకనుపాటు ఆలోచించింది. రామినాయుడి చెయ్యి విడిచిపెట్టి 'ఈ పీడ ఇంతతో వదిలించుకోవాలనుకుంది.' రామినాయుడు రెండంగల్లో గుమ్మం దాటేశాడు. దాటడమేమిటి సరస్వతమ్మ 'దొంగ' దొంగ', అని పెద్దగా అరవటమేమిటి ఒక్కసారి జరిగినై. వీరాస్వామి, వీరాస్వామిభార్య, పిల్లలు వాకిట్లో పడుకున్న పాలేళ్ళు సైన్యంలా వచ్చిపడ్డారు. తాగుబోతుకి రామినాయుడు చేసిన దొంగతనానికి సాక్ష్యంగా ఉండటం ఇష్టంలేక అక్కణ్నుంచి తప్పుకోవాలని మెల్లగా వెనక్కు తిరిగాడు.

'పట్టుకోండి...ఆడే.... తాగుబోతు... పారిపోతున్నాడు' పెద్దగా అరిచేసింది సరస్వతమ్మ.

వీరాస్వామి పాలేరు తాగుబోతుమీద విరుచుకుపడి కట్టేశాడు. చుట్టుపట్ల ఇళ్ళలో జనమంతా పోగయ్యారు. తాగుబోతు బిత్తరపోయాడు. వీరాస్వామి 'ఛెళ్ళు'న లెంప కాయ కొట్టాడు. పాలేరు తాగుబోతుని బరబర ఈడ్చుకొచ్చి మండువాలో స్తంభానికి కట్టేశాడు.

చిన్నా పెద్దా నిద్రమత్తు విదుల్చుకుని సావిట్లోకిచేరారు. హరికేను లాంతరు ఎత్తుమీద జెండాలా వెలుగుతోంది. సరస్వతమ్మ చెప్పటం మొదలెట్టింది– 'అర్ధరాత్రేళ మంచినీళ్లు తాగుదామని లేచేతలికి, పెద్దగదిలో అలికిడైంది. నిజంగా గుండె లవిసిపోయినా యన్నా!... కాస్త అట్టాగే తేరిపార సూస్తినిగదా మడిసి కదిలాడు. ఇంక నాకు భయమేసి, పెద్దగా దగ్గి, గళాసు మోగించే తలికి సల్లగా దొడ్డోకి జారు కున్నాడు. వాడట్టాగే పారిపోతాడని నేనూ వెనకాత్తే దొడ్డో కెళ్ళి పెద్దగా అరిస్తిని–అంతే!'

'బుల్లెమ్మా! సొమ్మేం పోలేదు గందా?' అనడిగాడు వీరాస్వామి.

'అబ్బే! ఏం పోలేదు. సమయానికి నే లేస్తిని. లేకపోతే సచ్చినోడు గుండం పెట్టేవాడే' అందిసరస్వతమ్మ

అప్పటిదాకా మాట పలక్కుండా తల వంచుకున్న తాగుబోతు ఒక్కసారి తలపైకెత్తి 'రూపాయి నోట్లు పోలా?' అని గుచ్చినట్లు అడిగాడు.

'సూశావా...సూశావా...అసలాడు రూపాయ నోట్ల కోసమే ఒచ్చాడంట' తొణుకు లేకుండా చెప్పింది సరస్వతమ్మ.

'బాదండశే! నాయాల్ని' గుంపులోంచి ఎవడో కేకేశాడు.

అనటమే తడవుగా తాగబోతు గూబ ఊడిపోయేట్టు కొట్టాడు పాలేరు.

'అమ్మో ...' అని సన్నగా మూలిగి తల వాల్చేసుకున్నాడు తాగుబోతు.

'కొట్టకండ హె! రేప్పొద్దున పట్నం పోలీసోళ్ళకి పారేస్తే సరి. వాళ్ళే పీకుక్క తింటారు' అన్నాడింకొకడు.

'ఎందుకురా పోలీసోళ్లు అదొక పీడ. రాత్రల్లా కట్టేసి పొద్దున్నే ఇడిసి పెట్టేయండ్రా — ఆడే పోతాడు.' అన్నాడు మరొకడు.

'నీకు తెల్దు మావాఁ. ఇసుమంటోళ్ళని పాపం తలవ గూడదే. పోలీసోళ్ళ కేసెయ్యాల్సిందే.' అన్నారు ఇద్దరు ముగ్గురు కుర్రకారు.

'ఓరి యీరాసావాఁ ... సొమ్మేం పోలేదు గదా — తాగిన్నాయాలు ఎదవపని సేశాడు. రాత్రల్లా పడేసుంచి పొద్దున్నే ఒగ్గేరా' అన్నాడు ముసలితాత.

వీరాస్వామి అంగీకారంగా తలూపాడు. అంతా ఎవరి దోవన వాళ్ళు ఆవులించుకుంటూ వెళ్ళిపోయారు. రెండోకోడి కూసిం తర్వాత వీరాస్వామి పాలేరు ఆఖరు దెబ్బగా మరొక్కటంటించి తాగుబోతుని వదిలేశాడు. తాగుబోతు ఇల్లంతా కళ్లుపెట్టుకు చూశాడు. సరస్వతమ్మ కన్పిస్తుందేమో, ఒక్క మాట చెప్పి పోదామని. కాని సరస్వతమ్మ లోపల గాఢంగా నిద్రపోతోంది. తలవంచుకొని కాళ్లుజార్చుకుంటూ సింగి గుడిసె కొచ్చేశాడు తాగుబోతు.

రామినాయుడు మాలగూడెం వోట్లు కట్టేసుకున్నాడన్న రహస్యం, చెవికీ చెవికీ పాకి చివరకి వీరాస్వామి గుండెబరువై

నిలిచింది. మాలగూడెం చీలతియ్యటం అంత తేలికైన పని కాదు. వీరాస్వామి గూడెంపెద్దని పిలిపించాడు. 'నా మాటేం చెప్పావ్ ?' అన్నాడు. గూడెంపెద్ద కాసేపు నసిగి, చివరికి నిజం చెప్పేశాడు.

'డబ్బుకి కక్కుర్తి పడతారేంరా—కావలిస్తే నేనింకో వంద ఎక్కువిస్తా తీసుకోండెహె!' అన్నాడు వీరాస్వామి. తోటోళ్ళతో మాట్లాడి చెప్తానని తిరిగిపోయాడు గూడెంపెద్ద.

పెనవేసుకుంటున్న గోగుతాడులా ఉంది ఊరు. ఎక్కుపెట్టిన విల్లంబుల్లా నడుస్తున్నారు మనుషులు. కదిలిస్తేచాలు ప్రతివాడూ పెట్లిపోయి మాట్లాడుతున్నాడు. వీరాస్వామిని ఓడగొట్టటానికి రామినాయుడు మార్గాలాలోచిస్తున్నాడు. మనుషుల్ని తన పక్క తిప్పుకోటం ఒకపద్ధతి; వీరాస్వామిని ఇంకొకరకంగా దెబ్బకొట్టి, దిగాలుపడేసి, మనుషుల్ని అతడి పక్కతిప్పుకోలేకుండా చేయటం ఇంకోపద్ధతి. ఉన్నట్టుండి రామినాయుడు తాగుబోతుకోసం కబురెట్టాడు. పాలేరు తిరిగి తిరిగి మామిడితోపులో నిద్రపోతున్న తాగుబోతుని లేపుకొచ్చాడు.

'ఏంది దొరా! పిల్సినావంట ?'

'ఏంలేదురా, మరీ నలుసయిపోయావ్ ?'

ఆ కాస్తదానికి—తనంటే ఇంత బయమేఁ రామినాయుడికి—ఇంత పిరికోడు బతుకుతున్నాడేఁ — అనుకున్నాడు తాగుబోతు.

'ఏం లేదురా! ఇవ్వాళ మా పుల్లావు కోడె నీనింది. కొంచెం జల్సా చేద్దామనుకుంటున్నాం. ఆ... నీకూడిక్కడే, నీ సీసాకూడా తెప్పిస్తాలే.'

'దాం దేముందిలే దొరా' నవ్వుకుంటూ పాలేరు వెనక రామినాయుడింట్లోకి నడిచాడు.

నిశిరాత్రి ఆకాశంలో ఒంటిగా నక్షత్రం మెరవడానికి భయపడింది. ఊరంతా సద్దుమణిగి నిద్రపోతోంది. దూరంగా కుక్క 'మో' మని ఏడిస్తే, నిద్రపోలేని ముసలాడు 'అప శకునం' అని అదిలిస్తున్నాడు. చీకట్లో ఏనుగుల గుంపులా నుంచున్న వీరాస్వామి గడ్డివాముల పక్కగా మనుషులు కదిలారు సై-అంటే సై- అని తలలూపుకున్నారు. దక్షిణపు పక్క వాము నుంచి సన్నగ పొగలేచి గప్పుమని మండింది. సఁయ్ మని మంట వాము కొప్పుకి పాకిపోయింది. ఊరు ఊరంతా గగ్గోలుగా లేచింది. మంటలు ఒక వాము నుంచి మరొక వాముకి విసిరిపారేస్తే అందుకున్నట్టు అల్లుకుంటున్నాయి. జ్వాల నాలుకలు చాచి విలయంగా నర్తించింది. సరుసరున అందినంతవరకూ పాకి కౌగిట్లో అదుముకుంది. పెళేలున పేలుతున్న మంటలు చూసి వీరాస్వామి కుంగిపోయి కూలబడి పోయినాడు. ఆర్పడానికి కడవలతో పోస్తున్న నీళ్ళు అగ్ని దేవుడి దాహం తీర్చలేక పోతున్నై.

'ఆనాడు ఆణ్ని కొట్టినందుకు తాగుబోతోడు వాముకి నిప్పెట్టేశాడు' ఒక మూలనుంచీ ఎవరో పెద్దగా అరిచేశారు.

వేగంతో పాకిపోతున్న మంటలా ఆ మాట ఒకళ్ళనుంచి మరొకరికి అందరికి అందిపోయింది.

'సేసిన దొంగతనానికి తోడు ఇంత కిరాతకమా' అన్నాడొహడు.

'కన్పిస్తే పెడరెక్కలిరిచి కట్టి మంటల్లో పారెయ్యాల' అన్నాడింకొకడు.

'రాత్రి మా కొట్లో అగ్గిపెట్టె కొంటున్నప్పుడే అనుకున్నా. వీ డేకొంపకి నిప్పెడతాడోనని' మనసులో మాట చెప్పేశాడు షావుకారు.

'గొడ్ల నోటికాడ కూడు తీసినోడు నరకాని కెడతాడ్లే!' శాపనార్థం పెట్టింది ముసలమ్మ.

ఎవరెన్ననుకున్నా, ఎవరెంత సేసినా ఆపలేని విధిలా, ఆగని సూర్యుడిలా మంట కొండల్లాంటి వాము లన్నింటినీ మాయంచేసి బూడిద మిగిల్చింది.

'తాగుబోతోణ్ని తెంర్రా! ముక్కలు ముక్కలుగా నరికెయ్యాల' అన్నాడు వీరాస్వామి కుళ్ళిపోతూ.

అంతలో పొలంమీాది వీరాస్వామి పాలేళ్ళు పరుగెత్తుకొచ్చారు. 'దొరా! గోరం జరిగిపోయిం' దంటూ.

ఎవరికీ మాట పెగల్లేదు.

'మన సేనికి పారాల్సిన నీళ్ళని ఎవడో కాలవకి గండికొట్టి మళ్ళించేశాడు.'

సలసలకాగే పెనం మీాద మినపగింజ పెట్లి పోయినట్లైంది.

'ఎందిరా మీారనేది?' బలంకొద్దీ కీచుమంటూ కేకేశాడు వీరాస్వామి

'నిజందొరా! రాత్రెవడో నీళ్ళు మళ్ళించేశాడు. తడవాల్సిన మనసేలో అంగుళం నీళ్ళుకూడా లేవు.'

'ఇదీ ఆ తాగుబోతోడి పనే!' అన్నా రెవరో పక్కనుంచి. పొండిరా! సూస్తారేంరా! ఆ తాగుబోతోడి సెత్తురు సూడందే నే కూడెట్టా తింటానురా!' అన్నాడు వీరాస్వామి పళ్ళుకొరుకుతూ.

వీరాస్వామి చేను నింపాల్సిననీరు మళ్ళగొట్టేశారు. అంతే. దాని ఫలితంగా రామినాయుడి చేనికి నీరెక్కిన సంగతి వాళ్ళ కక్కర్లేకపోయింది.

తాగుబోతు కోసం ఊరంతా వారం రోజులు గాలించారు కాని జాడలేదు. 'ఊరిడిసిపెట్టి లగెత్తాడు. లేకపోతే ముక్కలుసేద్దుం' అనుకున్నారు వీరాస్వామి ముఠా. వాళ్ళకి ఆ విషయం ఆట్టే పట్టించుకోటానికి వీల్లేక పోయింది. అంతకంటె ముఖ్యమయిన విషయాలు తొందర పెట్టినై.

ఎలక్షను నాలుగు రోజుల్లోకి వచ్చేసింది. వీరాస్వామి గుండు దెబ్బ తిన్న పులిలా రంగంలోకి దూకాడు. మాల గూడెం వోట్లు రహస్యంగా ఆ రొందలకి కట్టేశాడు. గూడెం పెద్దకి పాటి చేను మూడు సంవత్సరాలు కౌలుకి రాశాడు. సాయెబుల మసీదుకి ప్రహరీగోడ కట్టిస్తానని మాటిచ్చి వాళ్ళ ఓట్లన్నీ తిప్పేసుకున్నాడు. గొల్లపాలెం పెద్ద గొల్లని పిలిపించి ఈ సంవత్సరం అంకమ్మ జాతరకయ్యే ఖర్చు తనే పెట్టుకుంటానని రెండొందలు బయానాగా ఇచ్చేశాడు. వీరాస్వామి భార్య, ఇంటింటికి వెళ్ళి ఆడవాళ్ళందరికీ బొట్టుపెట్టి 'మా ఆయనకే మీ ఓటు' అని ఒట్టువేయించుకొచ్చింది. ఎలక్షను ఆఫీసరుగా ఎవర్ని వేస్తున్నారో ముందుగానే ఆరా తీసి తెలుసుకుని రాత్రికి రాత్రి ఆ వూరికి మనుషుల్ని పంపించాడు. వాళ్ళక్కడే అన్నీ బిగించుకుని జయంగా తిరిగొచ్చారు. వీటన్నిటి ఫలితంగా రెండూ రెండూ నాలుగు లాగా, మస్తాన్‌సాయెబు రండోల్ దెబ్బలా 'ధనా' మని వీరాస్వామి గెల్చేశాడు.

రామినాయుడికి తల తీసేసినట్లైంది. వేసిన పథకమంతా వెనక్కు తిరిగింది. మాలగూడెంవాళ్ళు తనిచ్చిన బయానా తనకి తెలియకుండా ఇంట్లో ఇచ్చివెళ్ళారట. 'అంతా మోసం చేశారు. వీరాస్వామి ప్రెసిడెంటయితే గాజులు తొడిగించుకుని ఎట్లా కూర్చోటం?' అనుకుని కుతకుత ఉడికిపోయాడు.

వీరాస్వామి గెలిచాడని తెలియగానే పెద్ద ప్రభ కట్టి ఊరేగింపు లేవతీశారు. పెళ్ళి జరుగుతున్నట్టుగా ఒకళ్ళమీద ఒకళ్ళు గులాం చల్లుకున్నారు. ప్రభకి ఇరవై జతల కాడెద్దుల్ని కట్టారు. ఎద్దుల కన్నింటికీ బొట్లుపెట్టి బంతిపూలదండలు వేశారు. గులాం పొట్లాలు పొట్లాలు ఎగిరిపోతున్నాయి. 'జే'లు మ్రోగుతున్నై. గాలంతా గులాంతో కలిసి ఎర్రగా తేలిపోతోంది. వీరాస్వామి మెళ్ళో దండలు నిండిపోతున్నాయి. ఇంటింటిముందు హారతు లిస్తున్నారు. కొబ్బరికాయలు కొడ్తున్నారు—'ఇదంతా తన కళ్ళముందే తను బతికుండగానే తనలో నెత్తురింకా చావకముందే—తన మీసం తీవిగా మెలి తిరిగి నిల్చున్నప్పుడే—ఛీ! నాది బతుకా!' లోపల మంటలు నరనరాల్లోకి పాకుతుంటే రామినాయుడు కూర్చోలేకపోయాడు.

రామినాయుడు ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. ఊరంతా సొమ్మసిల్లి పడుకుంది. లోపల ఆవేదన రామినాయుణ్ని మంచంమీద పడుకోనివ్వలేదు. 'తన్ని ఎదవని సేసి ఊరింకొకడు ఏల్తుంటే తనెందుకు బతికి', అనుకున్నాడు. తన తప్పు తెలుసుకున్నాడు. 'ఛీ'అని తన్ని తను తిట్టుకున్నాడు. ఈ మారు సరిగ్గా అనుకున్నాడు. 'తన్ని ఎదవని సేసి ఊరింకో డేల్తుంటే వాడెందుకు ...' కప్పుకున్న దుప్పటి విసిరి అవతల పారేశాడు.

తాగుబోతుకి వాల్తీగా వేళకొచ్చే అన్నం రాలేదు. లోపలి ఆకలి కళపెళ లాడింది. 'ఏంది కూడింకా రాలేదు ?' అనబోయి 'సీసా రాలేదేం దబ్బా!' అన్నాడు. నరాలు కుంగదీస్తున్నాయి. మత్తులేకుండా కళ్ళు చూడలేక గిలగిల కొట్టుకుంటున్నాయి. రామినాయుడి పాలేళ్ళు ఈ రోజు కొట్టం గదికి గొళ్ళెం పెట్టటం మర్చిపోయినారు. 'కిర్రు' మని చప్పుడు చేస్తూ తలుపు వచ్చేసింది. మెల్లిగా అడుగులు వేస్తూ తాగుబోతు రామినాయుడి పడక గది కిటికీ దగ్గరిగా నుంచుని 'ఇయ్యాళ సీసా రాలేద్దొరా!' అన్నాడు. లోప ల్నించి సమాధానం రాలేదు. తొంగిచూస్తే పక్క ఖాళీగా ఉంది. పక్క ఖాళీగా ఉంటే రామినాయు డెక్కడికి పోతాడో తనకు తెలుసు. 'అక్కడికి పోదునా — వద్దా' అని తర్కం పడ్డాడు. అంతరాంతరాల్లో ఏదో తొందర పెడితే ఆగలేక, వాకిలి దాటి బయటికి వచ్చేశాడు.

దూరంగా ఊరకుక్క 'భౌ' మని అరిచి ఆపేసింది. బజారంతా పూలు, గులాం చెల్లా చెదురుగా పడి ఉంటే ఎవరిదో పెళ్ళి ఊరేగింపు అయిం దనుకున్నాడు. వీరాస్వామి దొడ్లో గడ్డివామికి అవతల పక్కగా నుంచుని, గొంతు తగ్గించి 'దొరా' అన్నాడు. జవాబు రాలేదు. వామి కదల్లేదు. ఇవతల కొచ్చి చూశాడు ఎవ్వరూ లేరు. 'ఇంకెక్కడికి పోతాడబ్బా!' అనుకున్నాడు.

ఇంతలో వీరాస్వామి ఇంట్లోంచి 'అమ్మో ... ... అమ్మో ... చంపేశాడ్రోయ్ ....' అని పెద్దగా అరుపులు వచ్చినై. మరుక్షణంలో నెత్తురు చిమ్మిన బట్టల్తో — తళు క్కున మెరిసిన కాకుతో రామినాయుడు దొడ్లోకి దూకాడు.

తాగుబోతు చెదిరిపోయి వణుకుతూ 'ఏం...ద...ద్దొరా...' అన్నాడు.

రెప్ప కొట్టేంతలో రామినాయుడు బాకు తాగుబోతు ముందు విసిరేసి చువ్వలా సాగి, మెరుపల్లే మెరిసి, వీధిలోని చీకట్లోకి మాయమయ్యాడు. ఊరంతా బొబ్బలు పెడుతూ లేచింది. జనమంతా తోసు కొచ్చేశారు. వీరాస్వామి పాలేళ్ళు తాగుబోతుని పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. కొద్దిగంటల క్రితమే ప్రెసిడెంటయి, బాకుపోట్లు తిన్న వీరాస్వామి ఒక్క మాట కూడా చెప్పలేక ప్రాణాలు వదిలాడు. తాగుబోతుని బండి పగ్గంతో బిగించి రచ్చబండిమీది చెట్టుకి విరగతీసి కట్టేశారు. మిగిలిన పగ్గం తాడుతో పాలేళ్ళు 'చెడేలు' మని కొడ్తుంటే తాగుబోతు శరీరం పెట్లిపోయి నెత్తురు చిమ్మింది. తాగుబోతుకి మాట రావటం లేదు. 'తాగితే ఇంత సిచ్చా ?' అని సన్నగా మూల్గాడు.

'ఊరిడిసెల్లా డను కున్నాం.'

'ఆడి పగ ఇయ్యాల్టికి చల్లారిందా. నిలువునా పానం తీసేశాడు.'

'దొంగతనం సేశాడంటే ఊరుకున్నాం. వామికి నిప్పెట్టాడంటే పోనీలే అనుకున్నాం. కాలవకి గండి కొట్టాడు. ఖూనీ సేసిందాకా నిద్ర పోలేదు. ఈణ్ని పాతరెయ్యాల్సిందే.'

'ఎవరిమాట ఆళ్ళనేది ?' అనుకున్నాడు తాగుబోతు. తన్నే అంటున్నారని తెలిసికొని 'నాకేం ... తెల్దు' అనబోయాడు. మాట సాంతం పూర్తి కాకుండానే ఎవడో ముక్కు అదిరిపోయేట్టు గుద్దేశాడు. బొళబొళ నెత్తురుకక్కింది.

కబురందిన పట్నం పోలీసులు వెంటనే వచ్చారు. పోలీసుల్ని చూసి తాగుబోతు నిలువునా వణికిపోయాడు. తన్నెవరూ ఆదుకోరా—అని చుట్టూ దీనంగా చూశాడు. నిజం తెలిసిన ఇద్దర్లో రామినాయు డక్కడ లేడు. సరస్వతమ్మ మొహం తిప్పేసుకుంది. తాగుబోతు చేతులకి బేడీలు తగిలించారు.

చంద్రు డస్తమించాడు.

తెల్లవారకముందే కాకులు కావ్ కావుమని అరుస్తున్నాయి. మామిడితోపు చెట్లవెనక, వెక్కిపెట్టి ఏడుస్తూ భయంగా చూస్తున్న సింగికి చెప్పాలనుకున్నాడు తాగుబోతు. 'ప్రపంచకం ఎప్పుడూ తాగే ఉంటదే! దానికి నిజం ఎప్పుడూ తెలీదు.' ... సింగి అ దోవంట నడిచినప్పుడల్లా బాట ఆమాటలు చెప్తూనే ఉంది.